భారీగా విదేశీ మద్యం పట్టివేత

52 మద్యం బాటిళ్లు స్వాధీనం ఇద్దరు నిందితులు అరెస్ట్

పోలీసుల అదుపులో నిందితులు

సిటీబ్యూరో, మే 18 (నమస్తే తెలంగాణ): నిబంధనలకు విరుద్ధంగా విదేశీ మద్యం రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను ఆ బ్కారీ ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.3.60లక్షల విలువ చేసే విదేశీ మద్యంతో పాటు కారు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఎస్‌టీఎఫ్ ఈఎస్ అంజిరెడ్డి కథనం ప్రకారం..ఈ కేసులో శ్రీకుమార్ అగ్రవాల్, రోహిత్ కుమార్ అక్రమ మార్గంలో విదేశీ మద్యాన్ని సేకరించి నగరంలో పరిచయం ఉన్నవారికి విక్రయిస్తుంటారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ పోలీసులు ఆదివారం నగరంలోని బిర్లా మందిర్, ఆదర్శ్‌నగర్ మీదుగా కారులో వెళ్తున్న నిందితులను ఆపి తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో పెద్ద ఎత్తున విదేశీ మద్యం బయటపడింది. దీంతో నిందితులిద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 52విదేశీ మద్యం బాటిళ్లు, కారు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురిపై కేసు నమోదుచేసి, నాంపల్లి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ధారూరు, మే 18; ధారూరు మండల పరిధిలోని రైతులు, ప్రజలు భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ధారూరు తహసీల్దార్ సాజిదా బేగం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాను సారం ఈ నెల 19 సోమవారం, ఈ నెల 20 మంగళవారం వరకు నిర్వహించేందుకు రెండు రోజులు మూడు బృందాలుగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మూడు బృందాలు... మొదటి బృందంకు గణేష్ తహసీల్దార్ కలెక్టర్ కార్యాలయం, రెండవ బృందంకు సంధ్యా తహసీల్దార్ కలెక్టర్ కార్యాలయం, మూడవ బృందంకు నైమతల్లి/వెంట్‌రమణ రెడ్డిలు సహాయకులుగా ఉంటారని తెలిపారు. .ఈ నెల 19న సోమవారం మొదటి బృందం నాగసముందర్, రెండవ బృందం బురుగు గడ్డ, మూడవ బృందం రుద్రారం గ్రామాల్లోను, ఈ నెల 20న మంగళవారం మొదటి బృందం ధారూరు, రెండవ బృందం రాంపూర్, మూడవ బృందం గట్టేపల్లి గ్రామాల్లోను భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.మండల పరిధిలోని రైతులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ధారూరు,మే 18; వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి ఒక్కసారిగా వర్షం కురవడంతో వారాంతపు సంతలో కూరగాయలు తడిచిపోయాయి. వికారాబాద్‌లో ప్రతి రోజు సంతలాగానే ఉన్న ఆదివారం సెలవు దినం కావడంతో ప్రజలు ఎక్కువ మంది వచ్చి సంతలో కూరగాయలు కొనుక్కొని వెళుతుంటారు. రైతు బజారు సంతలో నిర్మాణంలో ఉండడంతో చిన్నపాటి , కూరగాయల వ్యాపారులు కురిసిన వర్షంకు కూరగాయలు తడిచి ముద్దైనాయి. నిర్మాణంలో ఉన్న దానిని పూర్తి చేసి వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కులకచర్ల, మే 18 : కులకచర్ల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన రమేశ్‌ను ఆదివారం సన్మానించారు. పీఎస్‌హెచ్ఎంఎ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు తుప్పలి ఆనంద్‌కుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నాగని వెంకట్‌రాములు, దళిత యువశక్తి యువజన సంఘం కోశాధికారి శివని చుక్కయ్య, దళిత యువశక్తి యువజన సంఘం మాజీ అధ్యక్షుడు జెట్టి గాళ్ల వెంకట్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, జిల్లా స్వేరోస్ ఉపాధ్యక్షుడు సాల్వీడ్ వెంకట్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కులకచర్ల మండలంలో పోలీసు వ్యవస్థను చక్కగా తీర్చిదిద్ది శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేయాలని అన్నారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తి అరెస్ట్

బంజారాహిల్స్, మే 18: యువతితో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా ప్రేమించాలి అంటూ వేధిస్తున్నవ్యక్తిని ఫిలిం నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే. ఒడిశా కు చెందిన వికాస్ గడాయ్ కొంతకాలంగా అపోలో ఆసుపత్రిలో హౌస్ కీపింగ్ పనిచేస్తున్నాడు. అక్కడే పనిచేస్తున్న ఓ యువతిని వెంటపడి వేధిస్తున్నాడు. రోజూ ఇంటికి వెళ్తున్న సమయంలో ప్రేమించాలి అంటూ ఇబ్బంది పెడుతున్నాడు. ఆమె ఫొటోలు మార్పింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తా అంటూ బెదిరిస్తున్నాడు. దీంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన ఫిలిం నగర్ పోలీసులు నిందితుడిని ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 306 మంది పట్టివేత

సిటీబ్యూరో, మే 18 (నమస్తే తెలంగాణ): మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 306మంది వాహనదారులను సైబరాబాద్ పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. పట్టుబడిన వాహనదారుల్లో 246మంది ద్విచక్రవాహనదారులే ఉండటం గమనార్హం. కాగా 9 మంది త్రిచక్రవాహనదారులు, 50 మంది నాలుగు చక్రాల వాహనదారులు, ఒకరు భారీ వాహనదారుడు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్షల్లో బీఏసీ రేంజింగ్ 35ఎం జీ/100ఎంఎల్ నుంచి 200ఎంజీ/100ఎంఎల్ మధ్యన 274మందికి, 200ఎంజీ/100ఎంఎల్ నుంచి 300ఎంజీ/100ఎంఎల్ మధ్య 26 మందికి, 301ఎంజీ/100ఎంఎల్ నుంచి 500ఎంజీ/100ఎంఎల్ మధ్య ఆరుగురికి బీఏసీ రేంజ్ ఉన్నట్లు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

కులకచర్ల, మే 18 : మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ కటింగ్ నుంచి పీరంపల్లి గ్రామం వరకు మిషన్ భగీరథ పైపులైన్లు లీకేజీలతో నీరు వృథాగా పోతుందని పలువురు పేర్కొంటున్నారు. ముజిహిద్‌పూర్ గేటు నుంచి పీరంపల్లి మధ్యలో మూడు నుంచి నాలుగు స్థలాల్లో మిషన్ భగీరథ నీళ్లు వృథాగా పోతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. గత 15 రోజుల నుంచి ఇదే విధంగా నీరు లీకవుతుందని పేర్కొంటున్నారు. పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేయించి నీటి వృధాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

వేలం పాట్లు

హెచ్ఎండీఏ పరిధిలో మళ్లీ వేలం
తెరమీదకు మిగిలిపోయిన స్థలాలు
కోకాపేట భూములతో వేలం ప్రక్రియ షురూ
రూ. 8500 కోట్ల రెవెన్యూ అంచనాతో ప్రణాళికలు

సిటీబ్యూరో, మే 18(నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన లే అవుట్లలో మిగిలిన ప్లాట్ల వేలానికి కసరత్తు మొదలుపెట్టారు. ఒకప్పుడు హాట్ కేకుల్లా అమ్ముడుపోయిన భూములకు ఇప్పుడు డిమాండ్ లేకుండా పోయింది. ఏడాదిన్నర కాలంగా అన్ని సౌలతులతో డెవలప్ చేసిన ప్లాట్లను విక్రయించలేకపోయారు. దీనికి మార్కెట్‌లో నెలకొని ఉన్న సందిగ్ధ పరిస్థితులే కారణం కాగా, హైదరాబాద్ కేంద్రంగా ప్రైమ్ ఏరియాల్లో ఉన్న భూములను వేలం వేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రూ. 8500 కోట్ల రెవెన్యూ లక్ష్యంగా హెచ్ఎండీఏ డెవలప్ చేసిన వెంచర్లలో ప్లాట్లను అమ్మనున్నారు. ఇప్పటికే వేలానికి సంబంధించిన ప్రణాళికలన్నీ పూర్తి కాగా, ముందుగా కోకాపేటలో మిగిలిన 20 ఎకరాల విస్తీర్ణంలోని ప్లాట్లతో వేలం ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఇందుకు కోకాపేట వెంచర్‌లో డెవలప్‌మెంట్ పనులు కూడా పూర్తయినట్లు ఇంజినీరింగ్ సిబ్బంది పేర్కొన్నారు. కాగా, హెచ్ఎండీఏ పరిధిలో కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న భూముల్లో మళ్లీ కదలిక వచ్చింది. ప్రాజెక్టులు చేపట్టేందుకు హెచ్ఎండీఏ ఇప్పటికే రూ. 20వేల కోట్ల అంచనాలతో ప్రణాళికలు సిద్ధం చేసినా... నిధులేక పనులన్నీ జాప్యం జరుగుతున్నాయి. ఈ క్రమంలో టీజీఐఐసీ వేలానికి వచ్చే స్పందన ఆధారంగా హెచ్ఎండీఏ భూముల వేలంపై కూడా అధికారులు సన్నాహాలు చేయనున్నారు. కోకాపేట నియోపోలిస్, ఇతర లే అవుట్ల ద్వారా కోకాపేట భూముల్లో 24 ఎకరాలను హెచ్ఎండీఏ అభివృద్ధి చేసింది. బంజారాహిల్స్, బుద్వేల్, వంటి కీలకమైన ప్రాంతాల్లోని వెంచర్లను వేలానికి సిద్ధం చేస్తున్నారు. కానీ మార్కెట్ దారుణంగా ఉండటంతో గడిచిన ఏడాదిన్నర కాలంగా వేలానికి హెచ్ఎండీఏ ముందుకు రాలేదు. అసలే మార్కెట్‌లో ఉన్న ప్రతికూలతలను దృష్టిలో పెట్టుకుని, ఆచితూచి అడుగులు వేస్తుండగా... హెచ్ఎండీఏ మరో ప్రయత్నంగా వేలం వేసేందుకు సిద్ధమైంది.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

మెహదీపట్నం మే 18: పట్ట పగలు అందరూ చూస్తుండగానే ఓ యువకుడిని దారుణంగా హత్య చేసిన నలుగురిని అరెస్ట్ చేశారు. ఈ సంఘటనకు సంబంధించి ఇన్స్పెక్టర్ నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 15న నాంపల్లి నిలోఫర్ ఆస్పత్రి సమీపంలో మహమ్మద్ అయాన్ ఖురేషి (21) అను యువకుడిని నలుగురు వ్యక్తులు కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేసి పారిపోయారు. విచారణ చేపట్టిన నాం పల్లి పోలీసులు శనివారం రాత్రి ఈ సంఘటన బాధ్యులను నిందితులను పట్టుకున్నారు. ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన సయ్యద్ మహ్మద్ ఖాద్రి, మహమ్మద్ అస్లాం, ఎండీ సిద్ధిక్ అహ్మద్, సయ్యద్ మజీద్ ఖాద్రిలు నాంపల్లి లో ఉన్న జువైనల్ కోర్టు సమీపంలో ఖురేషిని కత్తులతో పొడిచి హత్య చేశారు. 2020 లో అ యాన్ ఖురేషి తన బావ మునావర్‌ను హ త్య చేశాడు. ప్రతీకారంగా సోదరులు అయా న్ ఖురేషిని చంపేశారు. నలుగురిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు

వెంగళరావునగర్, మే 18 : నిర్మాణంలో ఉన్న భవన యజమానురాలిని కొందరు దుండగులు బెదిరించి బ్లాక్ మెయిల్ చేసిన ఘటన మధురానగర్ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ముషీరాబాద్ కు చెందిన శ్రీదేవికి రహ్మత్ నగర్ లో తనకున్న స్థలంలో ఇంటిని నిర్మించుకుంటుంది. ఇక్కడ ఇల్లు కట్టుకోవాలంటే మేం అడిగినంత డబ్బు ఇవ్వాలని రూ.15 లక్షలు ఇవ్వాల్సిందేనని అదే ప్రాంతానికి చెందిన రమేశ్, శ్రీనివాస్, సతీశ్, నర్సింగ్ పట్టుబట్టారు. లేదంటే 30 గజాల స్థలాన్ని ఉచితంగా రాసివ్వాలని డిమాండ్ చేశారు. అది కాకుంటే 180 గజాల స్థలాన్ని 10 ఏండ్ల కాలానికి లీజ్ కు ఇవ్వాలని.. లేకుంటే బల్దియా అధికారులకు ఫిర్యాదు చేసి కూల్చి వేయిస్తామని బెదిరించారు. అంత ఇవ్వలేనని చివరకు రూ.2 లక్షలు వారికి ముట్టజెప్పింది. మరికొంత డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. బల్దియా అధికారులు ఆ వృద్ధురాలి ఇంటి షటర్లతో పాటు స్లాబ్ ను కూల్చివేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాచిగూడ, మే 18: కల్తీ కల్లు తాగి ఫుటోవర్ బ్రిడ్జి నుంచి ప్రమాదవశాత్తు ప్లాట్ ఫారం పై పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ చిమ్నా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (35)కల్తీ కల్లు తాగి శనివారం అర్ధరాత్రి ఉందానగర్ రైల్వే స్టేషన్ ఫుటోవర్ బ్రిడ్జిపై నుంచి ప్లాట్ ఫారం-5 లో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని ఉస్మానియా మార్చురికి తరలించారు. మృతుడు ఒంటిపై ఆరెంజ్, ఎరుపు గీతల చొక్కా, సిమెంట్ రంగు పాయింట్ ధరించి, ఎత్తు 5.2 కలిగి ఉన్నాడు.

గాంధీ అలుమ్నీ మాజీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి మృతి

బన్సీలాల్ పేట్, మే 18 : గాంధీ వైద్య కళాశాల అలుమ్నీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్‌రెడ్డి (75) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆ యన ఇండో అమెరికన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశారు. గాంధీ మెడికల్ కాలేజీ 1967 బ్యాచ్‌కు చెందిన ప్రతాప్‌రెడ్డి స్టూడెంట్ యూనియన్ లీడర్‌గా పలు పదవులు నిర్వహించారు. అనంతరం గాంధీ అలుమ్నీ అసోషియేషన్ అధ్యక్షుడిగా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా సమర్థవంతమైన సేవలు అందించారు. గాంధీ అ లుమ్నీ భవనంలో సో మవారం ఉదయం గాంధీ వైద్యుల సందర్శనార్థం ప్రతాప్‌రెడ్డి పార్థివదేహాన్ని ఉంచిన అనంతరం వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం వైద్య కళాశాలకు ఆయన పార్థివ దేహాన్ని అప్పగించనున్నట్లు గాంధీ అలుమ్నీ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జీ.ఆర్. లింగమూర్తి తెలిపారు.

పోలీసుల అదుపులో బంగ్లాదేశీయులు..?

సిటీబ్యూరో, మే 18 (నమస్తే తెలంగాణ): శివారుల్లో అక్రమంగా తిష్టవేసిన విదేశీయులపై రాచకొండ పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇందులో భాగంగా కొందరు బంగ్లాదేశీయులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. శివారులోని పహాడీషరీఫ్, బాలాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో వేలాది మంది రోహింగ్యాలు శరణార్థులుగా వచ్చి ఉంటున్నారు. వీళ్లతో పాటు అక్రమంగా వచ్చి ఇంకా ఎంతమంది ఉంటున్నారనే విషయంలో రాచకొండ పోలీసులు నిఘా పెట్టారు. దీంతో పాటు కమిషనరేట్ పరిధిలోని మల్కాజిగిరి, జవహర్‌నగర్, ఉప్పల్, అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం వంటి ప్రాంతాల్లో పశ్చిమ బెంగాల్, బీహార్, యూపీల నుంచి వచ్చిన వలస కార్మికులు చాలా మంది ఉన్నారు. బంగ్లాదేశ్ నుంచి కూడా కొందరు అక్రమంగా దేశంలోకి చొరబడి పశ్చిమబెంగాల్ చిరునామాతో పనిచేస్తున్న వారు కూడా అప్పుడప్పుడు పట్టుబడుతున్నారు. జవహర్ నగర్ ప్రాంతంలో ఉన్న కొంత మందిని రాచకొండ పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. బాలాజీనగర్ ప్రాంతంలో 2021 నుంచి కొంత మంది ఆ ప్రాంతంలోనే ఉంటున్నారని పోలీసుల విచారణలో బయటపడింది. అదుపులో తీసుకున్న వారికి ఆధార్ కార్డులున్నాయా? ఇతరత్ర ఏమైనా గుర్తింపు కార్డులు పొందారా? ఎవరు వీళ్లకు ఆశ్రయమిచ్చారు, ఎలా వచ్చారు అనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

ప్రేమ పేరుతో యువకుడి వేధింపులు

బాలిక ఆత్మహత్య

నిందితుడు రవి

శంషాబాద్ రూరల్, మే 18 : ప్రేమ పేరుతో బాలికను వేధింపులకు గురి చేయడంతో బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దతూప్ర గ్రామానికి చెందిన తెలుగమల్ల రవి అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో లోబరుచుకొని మూడు రోజు క్రితం అమ్మాయిని తీసుకొని బయటికి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు శంషాబాద్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న యు వకుడు బాలికను గత శనివారం గ్రామంలో వదిలి వెళ్లిపోయాడు. ఇంటికి వచ్చిన బాలిక అదే రోజు రాత్రి పది గంటల సమయంలో ఇం ట్లోనే ఉరివేసుకొని మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు రవిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పని మనిషిగా చేరి.. ఇంటికి కన్నం వేసి..

నగలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

మియాపూర్, మే 18: ఇంట్లో పని మనిషిగా చేరిన మహిళ అదే ఇంటికి కన్నం వేసి నగలు తస్కరించిన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మియాపూర్ పోలీసుల వివరాల ప్రకారం... మైత్రీనగర్ జనప్రియ ఫేస్ 3 లో కృష్ణ కార్తీక్ నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. వీరి నివాసంలో బయమ్మ అలియాస్ లక్ష్మి అనే మహిళ గడచిన పది వారాలుగా పనిచేస్తున్నది. యజమాని ఇంట్లో లేని సమయంలో బీరువాలోంచి సదరు మహిళ 90 గ్రాముల విలువైన బంగారు నగలతో పాటు 77 గ్రాముల వెండి వస్తువులను దొంగిలించింది. దీనిపై బాధితుడు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దొంగిలించిన నగలను నారాయణఖేడ్ లో విక్రయించేందుకు వెళ్లగా సమాచారం అందుకున్న పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకొని మహిళను రిమాండ్‌కు తరలించారు .

దోమ, మే 18: మండల కేంద్రానికి కూత వేటు దూరంలోని దోమ పరిగి ప్రధాన రహదారికి పక్కన ఉన్న ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం తాగుబోతులకు అడ్డాగా మారింది. పాఠశాలకు సెలవులు ఉండటంతో పాటుగా వసతి గృహంలో విద్యార్థులు లేరని భావించిన మందు బాబులు వసతి గృహం ముందు బీరు బాటిళ్లు తెచ్చుకొని తాగి వదిలి వెళ్లారు. దీనిపై స్థానికులు మండిపడుతున్నారు. నిఘా లోపం కారణంగానే ఇలాంటి ఘటనలు దాపురిస్తున్నాయన్నారు. ఇటాంటి ఘటనలు జరుగకుకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డీజిల్ ట్యాంక్ పేలి మంటలు

చర్లపల్లి, మే 18 : చర్లపల్లి పారిశ్రామికవాడ ఐఓసీఎల్ పరిశ్రమ ప్రధాన రహదారిపై లారీ ట్యాంకర్‌కు చెందిన డీజిల్ ట్యాంక్ పేలి మంటలు చెలరేగడంతో ప్రయాణికులు, స్థానికులు భయందోళలనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, చర్లపల్లి పోలీసులు వెంటనే మంటలను ఆర్పివేయడంతో ఊపిరిపీల్చుకున్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలో ఐఓసీఎల్ పరిశ్రమ వద్ద రెండు నెలల నుంచి మాజీ భవాని ట్రాన్స్‌పోర్టుకు చెందిన లారీ ట్యాంకర్ నిలిపివేసి ఉంది. ఆదివారం లారీని విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా కొనుగోలు చేసేందుకు వచ్చిన మదనపల్లికి చెందిన రవిగౌడ్ తన క్లీనర్ మహ్మద్ ఫెరోజ్‌ఖాన్‌తో కలిసి లారీని ట్రయల్‌రన్ చేసేందుకు తీసుకువెళ్లగా ఒక్కసారిగా లారీకి చెందిన డీజిల్ ట్యాంక్ పేలి మంటలు రావడంతో వెంటనే రవిగౌడ్, క్లీనర్ లారీ నుంచి కిందకు దూకారు. రెండు సిలిండర్ లారీలు పాక్షికంగా అగ్నిప్రమాదానికి గురికాగా ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని పోలీసులు తెలిపారు.

పరిగి, మే 18 : హజ్ యాత్రకు బయలుదేరి వెళ్తున్న ముస్లింలకు హైదరాబాద్ నాంపల్లిలోని హజ్‌హౌస్‌లో పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. పరిగి నియోజక వర్గం నుంచి 22 మంది ముస్లింలు ఆదివారం హజ్ యాత్రకు బయలుదేరి వెళ్లారు. ఎమ్మెల్యే వారిని కలిసి శుభాకాంక్షలు తెలియజేసి ప్రయాణం సాఫీగా సాగాలని ఆకాంక్షించారు.

బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన

బొంరాస్‌పేట, మే 18 : దుద్యాల మండల పరిధిలోని ఈర్లపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అవుటి శేఖర్ అధ్వర్యంలో నూతన బీటీ రోడ్డు పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈర్లపల్లి గ్రామం నుంచి మైసమ్మగడ్డతండా వరకు రూ.కోటి 30లక్షలతో సీసీ రోడ్డు, బీటి రోడ్డు పనులు నిర్వహించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఎస్‌టీ సెల్ మండల అధ్యక్షుడు రవినాయక్, పులేందర్, పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కులకచర్ల, మే 18 : మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రాజకీయం చేయరాదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలకు అనుగుణంగా ధాన్యాన్ని స్వీకరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తుండగా కొందరు రాజకీయం చేయడం తగదని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

కులకచర్ల, మే 18: మండల కేంద్రంలో మిద్దె అంజయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి ఆయన కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అంత్యక్రియల నిమిత్తం కుమారుడు భీమయ్యకు రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చెలిమిళ్ల ఆనందం, నాయకులు చంద్రయ్య, వెంకటయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో పలు చోట్ల వర్షం

సిటీబ్యూరో, మే 18 (నమస్తే తెలంగాణ): ఉపరితల ద్రోణి ప్రభావంతో గ్రేటర్‌లో పలు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది. ఆదివారం రాత్రి 9గంటల వరకు నగరంలోని గచ్చిబౌలిలో 2.2 సెం.మీలు, చందానగర్‌లో 1.78 సెం.మీలు, లింగంపల్లిలో 1.60 సెం.మీలు, మియాపూర్‌లో 1.18 సెం.మీలు, సెంట్రల్ యూనివర్సిటీలో 1.0సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. కాగా ద్రోణి కారణంగా రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా నగరంలో ఉదయం నుంచి రాత్రి వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు 36.6డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 25.7డిగ్రీలు, గాలిలో తేమ 57శాతంగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
LEASE REQUIRED
★సంవత్సరం లీజుకు 10 Acres to 15 Acres భూమి కావాలి కొత్తూరు, షాద్‌నగర్, తిమ్మాపూర్, పరిసర ప్రాంతాలవారు 15 సంవత్సరాలు సంప్రదించండి: 9182757179
NT-342957
CHANGE OF NAME
★I, KONDA CHANDRA SHEKAR R/o. H.No: 3-126, Laxmi Narsimha Colony, Shadnagar, Farooqnagar (Mdl), Rangareddy (Dist), TG. to Change my Father Name from KONDA ANJAIAH to Konda Anjaiah Goud & my DOB from 6-2-1961 to 6-5-1962. for all purpose
NT-Parmesh
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962